## దశలవారీగా సమస్యల పరిష్కారం

కాప్రా: నియోజకవర్గంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ చైతన్యనగర్‌లో పర్యటించిన ఆయన కాలనీ అసోసియేషన్ సభ్యులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చైతన్యనగర్ డబుల్ బెడ్రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలు కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో సమస్యలు తలెత్తితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాలనీవాసులు బోడ నరేష్, లక్ష్మి, రమేష్, పాల్‌రాజ్, అంజయ్య, జ్యోతి, నజీమా, రజిని, విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విజయోత్సవ పుష్కర మేళా

గౌతంనగర్: డివిజన్ మల్కాజిగిరి లక్ష్మీసాయి గార్డెన్స్‌లో గురువారం సాయంత్రం 5 గంటలకు భారతీయ ప్రజా విజయోత్సవ పుష్కర మేళాను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేళలో లలితాసహస్రనామ స్తోత్రం, హనుమాన్ చాలీసా, సౌందర్యలహరి కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వివరించారు.

## పెద్దపల్లికి తరలిన ఉద్యమకారులు

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో పెద్దపల్లిలో జరుగుతున్న ఆత్మగౌరవ సదస్సు సమావేశానికి బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్వాల్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి బయలుదేరారు. ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ బృందం దయానంద్, కొండ స్వామి, గగన్‌కుమార్, జగన్‌యాదవ్, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జ్యోతినగర్‌లో రూ.42 లక్షలతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, సర్కిల్ అధికారులు ఏఈ దివ్యజ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్, అనిల్, కృష్ణగౌడ్, కిట్టు, సిద్ధిరాములు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, హబీబ్, మల్లేష్, రాజా, కాలనీవాసులు డానియల్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శామీర్‌పేట్: చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేటకు చెందిన కొండి మల్లేష్ (57), ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. కాగా గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 27న మధ్యాహ్నం బయటకు వెళ్తున్నానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం అలియాబాద్ గ్రామంలోని నయారా పెట్రోల్‌బంక్ సమీపంలోని చెట్టుకు ఓ వ్యక్తి మృతదేహం వేలాడుతుందని పోలీసులకు సమాచారం అందింది. వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా.. మృతుడు కొండి మల్లేష్‌గా గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## పాత పట్టణంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మేడ్చల్: వర్షాకాలంలో మేడ్చల్ పాత పట్టణంలో ప్రజలు రోగాల బారిన పడకుండా మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణ సమస్యలపై ఆయన బుధవారం ఉదయం కమిషనర్ నాగిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. పాత పట్టణంలో అపరిశుభ్రత ఎక్కువగా ఉందని, తాను ఇటీవల పర్యటించిన సమయంలో చూశానని వర్షాకాలంలో రోగాలు సులువుగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున దృష్టి సారించాలన్నారు. నూతన పట్టణం కంటే పాత పట్టణంలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అన్ని చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగిరెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు.

నాడు గుంతలమయంగా రోడ్డు



నేడు కొనసాగుతున్న పనులు



# దశాబ్దాల కల సాకారం !

- రూ.25.32 కోట్లతో 4.95 కిమీ మేర రోడ్డు విస్తరణ
- పర్వతాపూర్ 4 లైన్ల రోడ్డుతో మారనున్న రూపురేఖలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ కమాన్ నుంచి ప్రతాప్ సింగారం గ్రామం చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పాత రోడ్డుతో సహా 100 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. 4.95కి.మీ మేర విస్తరించనున్న ఈ రోడ్డు పనులకు రూ.25.32కోట్లతో పీర్జాదిగూడ నుంచి ప్రతాప్ సింగారం చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణ పనుల కోసం 100 శాతం హెచ్‌ఎండీఏ నిధులను కేటాయించింది. 100 ఫీట్ల రోడ్డు మధ్య డివైడర్, హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. ఓ వైపు 50 ఫీట్లు, మరో వైపు 50 ఫీట్ల రోడ్డును వేస్తూ.. ఇరువైపుల ఫుట్‌పాత్‌లను నిర్మించనున్నారు. సుమారుగా 70 శాతం మేర పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు.

**ఎట్టకేలకు పనుల్లో పురోగతి..**

దశాబ్దాలుగా పీర్జాదిగూడ-పర్వతాపూర్ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. ఎట్టకేలకు రోడ్డు పనులు చకచకా అడుగులు పడుతున్నాయి. ఈ రోడ్డు కొన్నిచోట్ల కేవలం 15 అడుగులు మాత్రమే ఉండటంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదచారులు తరుచుగా ప్రమాదాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దీంతో గత పీర్జాదిగూడ నగర పాలకవర్గం కౌన్సిల్‌లో పలుమార్లు చర్చించి ప్రభుత్వం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గత ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో టెండర్లను పిలిచి పనులు ప్రారంభించారు.

**నాటి నుంచి నేటివరకు..**

ప్రధాన రహదారికి పలు కాలనీల రోడ్లు అనుసంధానం కానున్నాయి. దీంతో శివారు ప్రాంతాల్లో ఉన్న పలు కళాశాలల విద్యార్థులు, పాఠశాలలు, పలు పనుల కోసం వెళ్లే వాహనదారులు, పలు గ్రామాలు, కాలనీల ప్రజలు, మూసీ పరివాహక ప్రాంతంలోని రైతులకు కష్టాలు తీరనున్నాయి. త్వరితగతిన 4 లైన్ల రోడ్డు పనులను పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

### ప్రభుత్వ పెద్దల సహకారంతో పనులు ప్రారంభించాం



పీర్జాదిగూడలో పెరుగుతున్న నగర జనాభా, రద్దీని దృష్టిలో ఉంచుకుని పీర్జాదిగూడ ప్రజల ప్రయాణ సౌలభ్యం దృష్ట్యా.. నాటి మున్సిపల్ కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మానం చేశాం. పీర్జాదిగూడ - పర్వతాపూర్ 4 లైన్ల రోడ్డును విస్తరించాలనే సంకల్పంతో ప్రభుత్వ అధికారులు, నాటి ప్రభుత్వ పెద్ద సహకారంతో రోడ్డు పనులను ప్రారంభించాం.

– జక్క వెంకట్‌రెడ్డి, మాజీ మేయర్ పీర్జాదిగూడ

### త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం



హెచ్‌ఎండీఏ నిధుల ద్వారా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పీర్జాదిగూడ- పర్వతాపూర్ 4 లైన్ల రోడ్డును ప్రారంభించింది. పనుల్లో జాప్యం కారణంగా ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఏడాదిలోనే పనుల్లో వేగం పెరిగింది. మిగిలిన పనులను త్వరలోనే పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

– శివకుమార్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పీర్జాదిగూడ

## లోతుకుంట జంక్షన్ వద్ద భారీ చెట్టు తొలగింపు !

అల్వాల్ ఐటీఐ కళాశాలలో పునరుజ్జీవానికి చర్యలు


ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నాటుతున్న దృశ్యం

అల్వాల్: రాజీవ్ రహదారి లోతుకుంట జంక్షన్ వద్ద ఉన్న పెద్దచెట్టు ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతోంది. చెట్లకొమ్మల వల్ల ప్రయాణికులకు ప్రమాదాలు, తీవ్ర అసౌకర్యం కలుగుతున్న కారణంగా అల్వాల్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంబంధిత అధికారుల అనుమతితో బుధవారం లోతుకుంట జంక్షన్ వద్ద ఉన్న చెట్టును తొలగించి అల్వాల్‌లోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలోకి తరలించారు. ఈ చెట్టు ఎదుగుదలకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ చెట్టు తొలగింపుతో లోతుకుంట జంక్షన్ వద్ద ట్రాఫిక్‌కు ఉపశమనం కలిగింది.

## నేటి నుంచి ఆంజనేయ ఆలయ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు


నిర్మాణంలో ఆలయ ప్రాంగణం

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలో పునర్నిర్మించిన పురాతన ఆంజనేయస్వామి దేవాలయంలో పునఃప్రతిష్ఠాపనోత్సవాలు నేటి నుంచి జూన్ 2 వ తేదీ వరకు జరగనున్నాయి. దేవాదాయశాఖ, దాతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈఓ వెంకన్న, ఎగ్జిక్యూటివ్ అథారిటీ (ప్రధాన దాత) చింతల మల్లేష్‌లు మాట్లాడుతూ.. సుమారు 4 శతాబ్దాల చరిత్ర దేవాలయానికి ఉందన్నారు. 1300 గజాల్లో ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మాణం చేశామన్నారు.

## గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ భూదేవినగర్‌లోని విజయగణపతి దేవాలయం 22వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్వాహకులు సునీల్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌సింగ్, కమలమ్మ, ప్రభావతి, హేమలత తదితరులున్నారు.


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

## వరద ముంపుతో అవస్థలు !

నాలాల్లో వ్యర్థాల పారబోత


జ్యోతినగర్‌లో పూడికతీయని నాలా

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని జ్యోతినగర్ మిర్జాలగూడ, వెంకటాద్రినగర్, చిన్మయిమార్గ్ ప్రాంతాల్లో వర్షంపడిన ప్రతిసారి ముంపునకు గురౌతున్నాయి. రోడ్ల ఆక్రమణతో పాటు వరద నీరు సజావుగా వెళ్లేందుకు నాలా నిర్మాణం సరిగ్గా లేకపోవడంతోన ఏళ్ల తరబడి కాలనీల ప్రజలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. రోడ్లపై నీళ్లు నిలిచి ఇళ్లలోకి చేరే పరిస్థితి నెలకొందని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.

## హైడ్రాకు ఏకశిలానగర్ సమస్య !


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్ వెంచర్ సమస్య హైడ్రా అధికారుల దృష్టికి చేరిందని ఏకశిలానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకు శివారెడ్డి అన్నారు. బుధవారం ఏకశిలాగర్‌లోని అసోసియేషన్ ఆఫీస్ వద్ద ప్లాట్ ఓనర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశానుసారం సర్వే నెంబర్లు 739 నుంచి 749 వరకు ఉన్న భూమిలో ఏర్పాటు చేసిన ఏకశిలానగర్ వెంచర్‌లో ఎలాంటి సర్వే నిర్వహించే వీలులేదన్నారు. ఈ సర్వే నెంబర్లలో వ్యవసాయభూమి లేకపోవడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారన్నారు. కొందరు వ్యక్తులు అక్రమంగా ప్లాట్ల హద్దు రాళ్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తులపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఇదే వెంచర్‌లో 7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లు, రోడ్లను నలుగురు వ్యక్తులు కబ్జా చేసి కాంపౌండ్ వాల్ కట్టారని, ఈ విషయాన్ని హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. న్యాయం ప్లాట్ ఓనర్ల పక్షానే ఉందని స్పష్టం చేశారు. అడ్వకేట్ జుబేర్, అసోసియేషన్ ప్రతినిధులు యాదగిరి, శ్రీనివాస్, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

## యోగా ద్వారానే ఆరోగ్యమైన సమాజం

అల్వాల్: అల్వాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ.. యోగా ద్వారానే ఆరోగ్యమైన సమాజం సాధ్యమన్నారు. 28ఎంకేజీ06.. అల్వాల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## నేటి జైహింద్ ర్యాలీ, సభను విజయవంతం చేయండి

మల్కాజిగిరి: బాచుపల్లిలో నిర్వహించే జైహింద్ ర్యాలీ, సభను విజయవంతం చేయాలని, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్‌కేనగర్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి మాట్లాడుతూ.. వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు ర్యాలీ అనంతరం బాచుపల్లి కొలను గోపాల్‌రెడ్డి కన్వెన్షన్‌లో సభ జరుగుతుందన్నారు. అన్ని డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో పెద్దఎత్తున తరలివెళ్తామన్నారు.

## ఇంటింటికీ సీపీఐ ప్రచార కార్యక్రమం

కాప్రా: సీపీఐ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసేందుకు ఇంటింటికీ సీపీఐ ప్రచార కార్యక్రమం చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్.బోస్ పిలుపునిచ్చారు. మేడ్చల్‌జిల్లా కుత్బుల్లాపూర్‌లో ఆగస్టు 19 నుంచి 22 వరకు సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకులు ప్రజాసమస్యలు విస్మరించారని, ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాలయాపన చేస్తూ.. ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, మేడ్చల్ జిల్లా సీపీఐ నేతలు ఉమామహేష్, సాయిలుగౌడ్, దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, హరినాథ్, శంకర్, స్వామి, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

మల్కాజిగిరి: కల్యాణ్‌నగర్, సీఫెల్ కాలనీలో రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఏడాది క్రితమే రహదారి నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరయ్యాయన్నారు. కొంతమంది వ్యక్తిగత స్వార్థంతో పనులు జరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కాలనీవాసులు సమస్య పరిష్కరించాలని కోరడంతోనే పనులు ప్రారంభించాలని, అధికారులకు సూచించామన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కూడా అలసత్వం వహించకుండా త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్, కాలనీవాసులు భాస్కర్‌రావు, గిరిప్రసాద్, గుండప్ప పాల్గొన్నారు.

# ఆరోగ్యకేంద్రంలో యోగాపై అవగాహన


ప్రభుత్వాసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామంతాపూర్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశానుసారం హైదరాబాద్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం నుంచి 25 రోజులపాటు యోగా అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం వైద్యులు గర్భిణులకు ఇతర రోగులకు యోగా తరగతులు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నరేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం యోగా ప్రాధాన్యతను మరింత పెంచేందుకు మే 28 నుంచి జూన్ 21 వరకు ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసి, అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆరోగ్యకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం !


ప్రమాదకరంగా డ్రైన్ పైకప్పు

బోడుప్పల్: రా చెరువు నుంచి దిగువ ప్రాంతానికి వర్షపు, మురుగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బాక్స్‌డ్రైన్ పైకప్పు పగిలిపోయింది. దీనికి మరమ్మతులు చేపట్టకుండా ఓ నాపరాయిని మూతగా పెట్టారు. 10 అడుగుల లోతులో ఈ డ్రైన్ ఉంది. ఇదే రోడ్డుపై వాహనదారులు, పాదచారులు ప్రతిరోజు వెళ్తుంటారు. చిన్నారులు సైతం క్రికెట్ ఆడుతూ.. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# పుస్తకాలు వచ్చేశాయ్ !

- ప్రభుత్వ పాఠశాలలకు చేరుతున్న పుస్తకాలు
- జూన్ 6 నుంచి బడిబాట


మండల వనరుల కేంద్రానికి చేరుకున్న పుస్తకాలు

మల్కాజిగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, యూనిఫామ్‌లు సిద్ధం చేస్తున్నారు. మల్కాజిగిరి మండల పరిధిలో 26 ప్రభుత్వ పాఠశాలల్లో 4218 మంది విద్యార్థులు, అల్వాల్ మండల పరిధిలో 25 పాఠశాలల్లో 4096 మంది విద్యార్థులు కలిపి మొత్తం 8314 మంది విద్యార్థులు ఉన్నారు. తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియం, ఉర్దూ మీడియంలో విద్యార్థులకు అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు ప్రధానోపాధ్యాయుల ద్వారా పాఠశాలలకు చేరుకుంటున్నాయి.

**అందుబాటులో క్యూఆర్ కోడ్.**

మల్కాజిగిరి మండల పరిధిలో చదివే విద్యార్థులకు 22819, అల్వాల్ మండల పరిధిలో 22419, మొత్తం 44968 పాఠ్య పుస్తకాలు అందజేయాల్సి ఉండగా.. మండల వనరుల కేంద్రానికి 29684 పుస్తకాలు చేరుకున్నాయి. పాఠ్యాంశాన్ని ఆన్‌లైన్‌లో చదువుకునేందుకు పీడీఎఫ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవడానికి క్యూఆర్‌కోడ్ కూడా అందుబాటులో ఉంచారు. 2 మండలాల్లోని 8314 మంది విద్యార్థులకు రెండు జతల్లో ఇప్పటికే ఓ జతకు సంబంధించిన క్లాత్‌ను స్టిచ్చింగ్ చేసేందుకు పంపించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా సిద్ధమవుతాయని, అధికారులు తెలిపారు. జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించడానికి ముందుకు రావాలి. పాఠశాలల్లో ఉన్న వసతులను గుర్తించాలి. పుస్తకాలు, యూనిఫామ్స్, భోజనం, వైద్య సదుపాయం అన్నీ ఉచితంగా లభిస్తాయి. గత విద్యా సంవత్సరంలో మల్కాజిగిరి, అల్వాల్ మండల పరిధిలోని స్కూళ్లల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారు. ఈసారి అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.

– అంబటి సురేష్, మండల విద్యాధికారి

# గంజాయి విక్రయిస్తున్న నలుగురి రిమాండ్


పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్‌లో 13.541 కిలోలు స్వాధీనం

ఉప్పల్: ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్, నాచారం పరిధిలో కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు కాపుకాసి నిందితులను మల్లాపూర్ పారిశ్రామికవాడలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13.541 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన పరకాల వినయ్‌గౌడ్, అదే ప్రాంతానికి చెందిన నేరెళ్ల సనీలగౌడ్, యాదాద్రి ప్రాంతానికి చెందిన స్వర్ణం అమర్‌నాథ్, పానుగంటి నిఖిల్‌లు ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి కిలోకు రూ.3000లకు తీసుకొచ్చి, కిలోకు రూ.10,000ల చొప్పున విక్రయిస్తున్నామని నిందితులు అంగీకరించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## భారత ఆర్మీకి విరాళం


ఆర్మీ అధికారులకు డ్రాఫ్ట్‌ను అందజేస్తున్న అనురాధ

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ వజ్రా ఎన్‌క్లేవ్‌కు చెందిన మధ్యతరగతి మహిళ సింగంశెట్టి అనురాధ దేశభక్తితో 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా ప్రాణాలను అర్పించిన భారత సైనికుల వీరత్వానికి గౌరవంగా భారత ఆర్మీకి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం తెలంగాణ అండ్ ఆంధ్ర సబ్ ఏరియాకు చెందిన సీనియర్ ఆర్మీ అధికారులు బృందాధిపతి నంజుండేశ్వర, ఎన్.వీ.కర్నల్ సురేష్‌గౌడ్‌లకు డ్రాఫ్ట్ రూపంలో అనురాధ అధికారికంగా అందజేశారు. అనంతరం ఆర్మీ అధికారులు అనురాధను అభినందించారు.

# 24 గంటల్లో రైతులకు ధాన్యం డబ్బులు

పౌరసరఫరాశాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి


వివరాలు తెలుసుకుంటున్న మేనేజర్ సుగుణబాయి

ఘట్‌కేసర్: అన్నదాతల నుంచి కొనుగోలు ధాన్యం డబ్బులు 24 గంటల్లో వారి ఖాతాల్లో జమచేస్తామని పౌరసరఫరాశాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి అన్నారు. మాదారం, ఏదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో సరిపోను హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. తూకం వేసిన వెంటనే మిల్లుకు పంపించాలన్నారు. తూకం యంత్రాలు, టార్పలిన్లు, తేమ మీటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రైతుల దిగుబడి కొనుగోలు వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు.

## మహిళ అదృశ్యం

జవహర్‌నగర్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవేందర్‌నగర్‌లో నివసించే అక్షయ్, భార్య రాణి (20) కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈనెల 27న భార్యభర్తల మధ్య గొడవతో మనస్థాపం చెందిన భార్య ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ వెతికినా లభించకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.